క్లుప్తంగా

30 మందికి ఉచిత నేత్ర వైద్యపరీక్షలు



పెదపెంకిలో రోగులకు వైద్యపరీక్షలు చేస్తున్న ఆప్తాలమిస్ట్ రమేష్

బలిజిపేట: మండలంలోని పెదపెంకిలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్యశిబిరంలో 30మందికి వైద్య పరీక్షలు చేశారు. పెదపెంకికి చెందిన ఈర్ల సంజీవనాయుడు ఆధ్వర్యంలో విజయనగరం పుష్పగిరి హాస్పిటల్ సౌజన్యంతో సత్యసాయి మందిరం వద్ద వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 30 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించగా 10మంది శస్త్ర చికిత్సకు ఎంపికైనట్లు ఆప్తాలమిక్ రమేష్ తెలిపారు. శస్త్ర చికిత్సకు ఎంపికైన వారిని తీసుకువెళ్లి ఉచితంగా వారికి శస్త్రచికిత్సలు చేసి, మందులు ఇచ్చి తీసుకురానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్యాంప్ కో ఆర్డినేటర్ వెంకటరమణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ



విద్యుత్ స్తంభాలు నిలబెడుతున్న విద్యుత్ శాఖ సిబ్బంది

సాలూరు రూరల్: ఇటీవల వీచిన ఈదురు గాలులకు మండంలోని గిరిజన గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగి పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో విద్యుత్ శాఖాధికారులు స్థానిక గిరిజనుల సహకారంతో ఏజెన్సీ గ్రామాలైన జాకరవలస, దొర్లతాడివలస, బట్టివలస, చినబారిగాం, గొయ్యిగూడివలస, గదబవలస, మూలతాడివలస గ్రామాల మధ్య విద్యుత్ స్తంభాలు పునరుద్ధరించి విద్యుత్ సరఫరా అందజేశారు.

మీ కోసం వెబ్‌సైట్ ద్వారా పీజీఆర్ఎస్ వివరాల నమోదు

- కలెక్టర్ డా.ఎస్ ప్రభాకర్‌రెడ్డి



పార్వతీపురం రూరల్: మీకోసం వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో సరైన వివరాలతో పీజీఆర్ఎస్‌కు సమస్యల అర్జీలు నమోదు చేసుకోవచ్చునని కలెక్టర్ డా.ఎస్.ప్రభాకరరెడ్డి తెలిపారు. అలాగే పతిరోజూ ప్రజలు తమ సమస్యల వినతులను అందజేసేందుకు కలెక్టరేట్‌లో ఉన్న గ్రౌండ్ ఫ్లోర్‌లో ప్రత్యేక సిబ్బంది ద్వారా పీజీఆర్ఎస్ సెల్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు, అంతే కాకుండా ప్రతి సోమవారం కలెక్టరేట్‌తో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలు ఫిర్యాదులపై అర్జీలు అందజేయవచ్చన్నారు. అలాగే వచ్చిన అర్జీల వివరాలను టోల్‌ఫ్రీ నంబర్ 1100కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని సూచించారు.

రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాలి

కొమరాడ: రైతులకు పంట నష్టపరిహారం వెంటనే చెల్లించాలని సీపీఎం నాయకుడు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. మండలంలోని దేవుకోన పంచాయతీలో తుపాను వర్షాలకు నష్టపోయిన జీడి, అరటి, మొక్కజొన్న తదితర పంటలను ఆయన ఆదివారం పరిశీలించారు. రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు పంట నష్టం జరిగిన ప్రాంతాల్లో పర్యటించి, పంట నష్టం అంచనా వేయాలని, నష్టపోయిన రైతులందరికీ నష్టపరిహారం అందివ్వాలని కోరారు.

వాడిన పూలు.. రోడ్డు పాలు..!

- ఆదరణ కరువై..అనాథలైన వృద్ధులు
- కనికరం చూపని కన్నపేగు
- జీవన చరమాంకంలో రోడ్డున పడిన బతుకులు
- దాతల దయ..అరకొర వసతులతో జీవనం

ముగ్గుబుట్ట వంటి తల..ముడతలు పడిన చర్మం..లోతుకుపోయిన కళ్లు.. శక్తి కోల్పోయిన నరాలు..కరాలు..జీవిత చరమాంకంలో కనిపించే మనుషుల ఆహార్యం ఇది. వంట్లో శక్తి ఉన్నంతవరకు రెక్కలు ముక్కలు చేసుకుని కుటుంబ జీవనాన్ని నెట్టుకొచ్చిన పెద్దలు జీవన చరమాంకంలో వారసులకు ఎందుకూ కొరగాకుండా పోతున్నారు. వారిని ఎలా వదిలించుకోవాలా అని భావిస్తున్న వారసులు వృద్ధాశ్రమాల్లో వారిని విడిచిపెట్టి చేతులు దులుపుకుంటున్నారు.

పార్వతీపురం రూరల్:

పెద్దల జీవన చరమాంకంలో అండగా నిలవాల్సిన చేతులే అఖాతంలోకి నెట్టేస్తుంటే దిక్కుతోచని స్థితిలో నిరాశ్రయుల భవనాన్ని వృద్ధులు ఆశ్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ వృద్ధాప్యపు బతుకులు కన్నీటి సంద్రంలో కొట్టుమిట్టాడుతున్నాయి. మరి కొంతమంది అయితే పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో ప్రధాన రహదారిపై బతుకులీడుస్తున్న హృదయ విదారక దృశ్యాలు గోచరిస్తున్నాయి. ప్రధాన రహదారులు, వీధి కూడళ్లే వారికి నివాసాలయ్యాయి. కన్నపేగు కనికరం చూపని వేళ, ఎవరో ఒకరు అపన్నహస్తం అందించి ఆదుకోకపోతారా అని ఆశగా ఎదురుచూస్తున్నారు అభాగ్యులు.

కనికరం కోల్పోయిన కన్నపేగు

నవమాసాలు మోసి, కని పెంచి, తమ రెక్కల కష్టాన్ని ధారపోసి పిల్లలను ప్రయోజకులను చేసిన తల్లి దండ్రులకు చివరికి మిగిలేది కన్నీరేనా? జీవిత చరమాంకంలో ప్రేమగా చూసుకోవాల్సిన రక్త సంబంధీకులే వారిని భారంగా భావిస్తున్నారు. వయసు పైబడిన ఆ శరీరాలకు అండగా నిలవాల్సిన వారే, వారిని నిర్దాక్షిణ్యంగా వీధుల పాలు చేస్తున్నారు. ఆదరణ కరువై, అనాథలుగా మిగిలిపోతున్న వృద్ధులెందరో పార్వతీపురం పట్టణ వీధుల్లో తలదాచుకుంటున్నారు. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ, చలికి వణుకుతూ విధిరాతను నిందిస్తూ దిక్కుతోచని స్థితిలో కొందరు వృద్ధులు భిక్షాటన చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. ఒకప్పుడు తమ పిల్లలకు ప్రపంచాన్ని పరిచయం చేసిన ఆ చేతులు, నేడు గుక్కెడు మెతుకుల కోసం ఇతరుల ముందు చేయి చాచాల్సిన దుస్థితి దాపురించింది.



నిరాశ్రయుల భవనంలో ఉన్న వృద్ధులు

నిరాశ్రయుల భవనమే ఆశ్రయం.. దాతలే దైవాలు

పట్టణంలోని ప్రధాన రహదారి కూడళ్లు, బస్టాండ్ పరిసరాలు, ఆలయాల వద్ద చాలా మంది వృద్ధులు నిస్సహాయ స్థితిలో కనిపిస్తున్నారు. పండుటాకుల్లా రాలిపోవాల్సిన వయసులో, పసిపిల్లల్లా రోడ్డున పడ్డ వారి దీనగాథ ఎవరినీ కదిలించడం లేదు. అయితే, మానవత్వం ఇంకా మసకబారని దాతలు కొందరు అప్పుడప్పుడు అందించే అన్నం పొట్లాలతోనే వారి ఆకలి మంటలు చల్లారుతున్నాయి. ఈ క్రమంలో, జిల్లా కేంద్రంలో దాతల సహకారంతో అరకొర వసతులతో నడుస్తున్న రైతు బజార్ సమీపంలో ఉన్న నిరాశ్రయుల భవనం వారికి కొంత ఊరటనిస్తోంది. కానీ, ఆశ్రయం పొందుతున్న వారి సంఖ్యకు, అక్కడ ఉన్న సౌకర్యాలకు పొంతన ఉండడం లేదు. అయినా ఉన్నంతలో సర్దుకుపోతూ, తలదాచుకోవడానికి ఓ నీడ దొరికినందుకు సంతృప్తి చెందుతున్నారు.



జిల్లా కేంద్రంలో ఉన్న నిరాశ్రయుల భవనం

ఆపన్న హస్తం కోసం ఎదురుచూపులు

జిల్లా కేంద్రంలో దాతల సాయంతో నడుస్తున్న ఆ నిరాశ్రయుల భవనం లోపలికి వెళితే, అక్కడ మానవత్వం పరిమళిస్తుంది. అదే సమయంలో వారి నిస్సహాయత కళ్లకు కడుతుంది. ఆ భవనానికి ప్రభుత్వ నిధులు గానీ, ఒక శాశ్వత ఆదాయ వనరు గానీ లేదు. పట్టణంలో ఎక్కడైనా శుభ కార్యాలు జరిగితే, అక్కడ మిగిలిన భోజనం వీరి ఆకలి తీరుస్తుంది. మిగిలిన రోజుల్లో ఎవరో ఒక దాత ఇచ్చే సరుకులతో వంట చేసుకుంటారు, లేదంటే ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి.

అక్కడ ఉన్న వసతులు కూడా దాతలు ఇచ్చినవే. ఒకరు మంచాలు ఇస్తే, మరొకరు దుప్పట్లు అందజేశారు. ఇంకొకరు బియ్యం, పప్పు అందిస్తే..ఇలా దాతృత్వంతోనే ఆ నిలయం నడుస్తోంది. సరిపడా సిబ్బంది కూడా లేరు. అయితే అప్పుడప్పుడు దాతలే వారి పాలిట తాత్కాలిక 'ఆపన్నులుగా' కనిపిస్తున్నా, వారి సాయం శాశ్వతం కాదు. అందుకే, ప్రభుత్వ రూపంలో ఒక శాశ్వత అండ దొరకదా అని అక్కడి వృద్ధుల కళ్లలో ఎదురుచూపు కనిపిస్తూనే ఉంటుంది. స్థిరమైన వసతి, పౌష్టికాహారం, వైద్య సదుపాయం కల్పించే ఒక శాశ్వత 'ఆపన్న హస్తం' కోసం ఆ అభాగ్యులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

సీఎం చెప్పినా పట్టదా?

- మండిపడిన గిరిజన సంఘం నాయకులు



మాట్లాడుతున్న గిరిజన సంఘాల నాయకులు

పార్వతీపురం: కురుపాం బాలికల గురుకుల పాఠశాలలో వారం వ్యవధిలో ఇద్దరి గిరిజన విద్యార్థుల మృతి, 110 మందికి పైగా గిరిజన విద్యార్థులు పార్వతీపురం, విశాఖపట్నం ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నప్పటికీ జిల్లాకు చెందిన గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరిలు పరామర్శించకపోవడంలో ఆంతర్యమేమిటని సీపీఐ, ఏఐటీయూసీ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, రైతు సంఘ నాయకులు కె.మన్మథరావు, ఆర్‌వీఎస్ కుమార్, బి.రవికుమార్, బి.అప్పలనాయుడు, దుర్గారావు, సింహాద్రి కిరణ్‌కుమార్‌లు ప్రశ్నించారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలో వారు మాట్లాడుతూ విద్యార్థుల అస్వస్థతపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కలెక్టర్లతోను, కేజీహెచ్ వైద్యులతోను నేరుగా మాట్లాడి మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశాలు జారీ చేశారని కానీ జిల్లాకు చెందిన గిరిజన సంక్షేమ శాఖమంత్రి ప్రభుత్వ విప్, గిరిజన ఎమ్మెల్యేలు స్థానికంగా ఉండి ఇంత జరిగినా పాఠశాలను కానీ, జిల్లా కేంద్రంలో ఉన్న ఆస్పత్రులను కానీ ఇంతవరకు సందర్శించిన దాఖలాలు లేకపోవడం శోచనీయమన్నారు. ఏక కాలంలో గురుకుల పాఠశాలలో చదువుతున్న బాలికలు పచ్చకామెర్లు, జ్వరాల బారిన పడడం, వారం వ్యవధిలో ఇద్దరు విద్యార్థులు మృత్యువాత పడడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ సమస్య కారణంగా ఎప్పుడు ఎవరి ప్రాణాలు పోతాయోనని సర్వత్రా ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. పాఠశాల/కళాశాలలో 611 మంది విద్యార్థులు చదువుతుంటే వారికి 24గదులు మాత్రమే ఉన్నాయన్నారు. అందులో 16గదుల్లో తరగతులు, వసతికి రెండు గదులు వినియోగించడంతో నిత్యం మౌలిక సదుపాయాల కొరత వెంటాడుతోందన్నారు. విద్యార్థుల మృతికి, 110 మంది గిరిజన విద్యార్థులు అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలవడానికి కారకులైన అధికారులందరినీ తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

మండల, గ్రామ కమిటీలు త్వరగా పూర్తి చేయాలి



బలిజిపేటలో నాయకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు

- మాజీ ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: వైఎస్సార్‌సీపీ మండల, గ్రామ కమిటీలు త్వరగా పూర్తిచేయాలని మాజీ ఎమ్మెల్యే జోగారావు నాయకులకు సూచించారు. ఈ మేరకు బలిజిపేటలో పార్టీ సంస్థాగత కమిటీల ఏర్పాటుపై మండల నాయకులకు ఆదివారం ఆయన దిశా నిర్దేశం చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఇప్పటికే చాలావరకు సంస్థాగత కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బలిజిపేట మండలంలో ఇంకా పూర్తికాని వివిధ అనుబంధ విభాగాలతో పాటు గ్రామస్థాయి కమిటీలను పూర్తిచేయాలని నాయకులకు సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, జెడ్పీటీసీ రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి టి.ప్రసాదరావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజానికి నడక లాభదాయకం

- వాకర్ సెంటర్ నేషనల్ కన్వెన్షన్ చైర్మన్ గున్నేశ్వరరావు

పార్వతీపురం: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ నడవాలని వాకర్ సెంటర్ నేషనల్ కన్వెన్షన్ చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు అన్నారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని యిండుపూరు వెంకటరావు ఆర్యవైశ్య కల్యాణ మంటపంలో వాకర్ సెంటర్ నేషనల్ కన్వెన్షన్ చైర్మన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వాకర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న అంతర్జాతీయ వాకర్స్ అధ్యక్షురాలు ఎం.ప్రభావతి మాట్లాడుతూ రోజూ దైనందిన కార్యక్రమాల్లో భాగంగా వాకింగ్ చేయడం వల్ల ఆరోగ్యాన్ని మెరుగు పరుచుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. యోగా, స్వచ్ఛభారత్ తదితర కార్యక్రమాల్లో వాకర్స్ సభ్యులు పాల్గొని ప్రజలను ఉత్తేజ పరచాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వామ్యమయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో వాకర్స్ సభ్యులు ఫాస్ట్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఎస్.రామానంద్, డా.శర్మ, చెలికాని సీతారామయ్య, ఫాస్ట్ గవర్నర్ జామి నారాయణస్వామి, ప్రెసిడెంట్ ఆర్‌ఎస్ నాయుడు, ఎస్‌వీఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 2026 ఇంటర్నేషనల్ వాకర్స్ క్లబ్ ప్రెసిడెంట్‌గా రవిరాజును, 2027 ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్‌గా రావి కృష్ణారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల రీజనల్ కౌన్సిలర్లు, గవర్నర్లు, క్లబ్ ప్రెసిడెంట్లు పాల్గొన్నారు.



క్లబ్ సమావేశంలో పాల్గొన్న సభ్యులు, ప్రతినిధులు

కూటమి ప్రభుత్వం తీరు మార్చుకోవాలి

- వైఎస్సార్‌సీపీ నాయకులు

భామిని: పంటల బీమా సొమ్ము చెల్లించకుండా రైతులను మోసం చేసిన కూటమి ప్రభుత్వం తీరు మార్చుకోవాలని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి తోట సింహాచలం, మండల అధ్యక్షుడు బోదెపు శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు మజ్జి మోహన్‌బాబు ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, ఈదురు గాలులకు వేలాది ఎకరాల్లో వరి, పత్తి, మొక్కజొన్న, కూరగాయల పంటలు పాడయ్యాయన్నారు. ప్రభుత్వం స్పందించి బాధిత రైతులకు పరిహారం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొత్తకోట చంద్రశేఖర్, మడపాన కేశవ, భార్గవ నాయుడు, కాగితాపల్లి కృష్ణారావు పాల్గొన్నారు.

గౌరీ పౌర్ణమి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

గరుగుబిల్లి: గౌరీ పౌర్ణమి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలోని పెద్దూరు, గరుగుబిల్లి, రావివలస, రావుపల్లి, చినగుడబ, గొట్టివలస, కొత్తూరు తదితర గ్రామాల్లో సోమవారం రాత్రి నుంచి ఆరంభమయ్యే ఈ వేడుకలకు నందెన్నలు సిద్ధం చేశారు. స్థానికంగానే శివుని సమేత గంగాదేవి, పార్వతీదేవి, వినాయకుడి విగ్రహాలను తయారు చేసి, ప్రదర్శిస్తుంటారు. పంటలు బాగా పండాలని గంగాగౌరీలకుభక్తులు పూజలు చేస్తారు.

త్వరలో రోడ్డు పనులు ప్రారంభం

- ఆర్‌అండ్‌బీ సహాయ ఇంజినీర్ విజయ్‌కుమార్

సీతానగరం: సీతానగరం నుంచి చినభోగిలి రహదారిలో పాడైన రోడ్లకు పూర్తి స్థాయిలో మరమ్మతులు రూ.22 లక్షలతో చేపట్టనున్నట్లు ఆర్‌అండ్‌బీ సహాయ ఇంజినీర్ కె.విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలియ జేశారు. ఈ నెల 2న సాక్షి దినపత్రికలో 'ఆదమరిస్తే ప్రాణాలు గాలిలోకే' అనే శీర్షికన ప్రచురితమైన కథనంపై ఆయన స్పందిస్తూ రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జి పనులు జరుగుతున్నాయని, వర్షాలు వస్తున్నందున నీటిని ప్రస్తుతం ఉన్నరోడ్డు మీదుగా మళ్లించడంతో తారు రోడ్డు పూర్తిగా ధ్వంసమైందన్నారు. వైట్‌మిక్స్ మకడం వేసి ఇదివరకే గుంతలు పూడ్చామని, వర్షం నీటిని రైల్వే సిబ్బంది దగ్గర్లో ఉన్నకాలువలోకి మళ్లించకపోవడంతో రహదారి పాడైందన్నారు. రోడు మరమ్మతులు చేపట్టమని రైల్వేశాఖకు తెలియజేసినా వారినుంచి స్పందన లేదన్నారు. ఈ మేరకు మరమ్మతులు చేపట్టడానికి రహదారులు భవనాల శాఖకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్...

విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలి

గుమ్మలక్ష్మీపురం: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, గురుకుల పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బొత్తాడ శంకరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన స్థానిక విలేకరులతో ఆదివారం మాట్లాడారు. కురుపాం గురుకుల పాఠశాల విద్యార్థులు పి.అంజలి, టి.కల్పనలు అనారోగ్యంతో మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. ఇదే ఘటనలో పాఠశాల సిబ్బంది, అధికారులు, ప్రభుత్వ నిర్లక్ష్యంపై నిలదీసేందుకు పాఠశాల సందర్శనకు వెళ్తున్న విద్యార్థి సంఘాల నాయకులు, ప్రజాసంఘాల నేతలను పాఠశాల లోపలికి అనుమతించకపోవడం సరికాదన్నారు. మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్ప శ్రీవాణి ఇటీవల అనారోగ్యం బారినపడిన విద్యార్థినులను పరామర్శించి, వారి అనారోగ్యానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నాకే అధికార యంత్రాంగం స్పందించిందన్నారు. ప్రస్తుతం అనారోగ్యం బారినపడి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి మెరుగైన వైద్యం అందించాలని, భవిష్యత్‌లో విద్యార్థుల మరణాలు సంభవించకుండా చూడాలన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే విద్యార్థుల మరణాలు

కురుపాం: ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే విద్యార్థుల మరణాలు సంభవిస్తున్నాయని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్‌వీఎస్ కుమార్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సింహాద్రి దుర్గారావు విమర్శించారు. కురుపాం గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు అనారోగ్యం బారినపడి చనిపోగా ఈ అంశంపై వారు ఆదివారం విలేకరులతో మాట్లాడారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభుత్వం శ్రద్ధ వహించడం లేదని ఆరోపించారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంలో చంద్రబాబు సర్కారు విఫలమైందన్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి, విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పించాలని కోరారు.

డంపింగ్ యార్డులా పెద్దగెడ్డ



పెద్దగెడ్డ పరిసరాల్లో వేసిన చెత్తాచెదారం పారిశుద్ధ్య వ్యర్థాలు

- జలాశయం చుట్టూ పారిశుద్ధ్య వ్యర్థాలు
- అపరిశుభ్రం చేస్తున్నారంటున్న పర్యాటకులు
- పట్టించుకోని అధికారులు

పాచిపెంట:

పర్యాటక ప్రాంతంగా ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకునే పెద్దగెడ్డ, అధికారుల నిర్లక్ష్యం పుణ్యమా అని పారిశుద్ధ్య వ్యర్థాలతో నేడు కంపు కొడుతోంది. మండల కేంద్రంలో ఇళ్ల నుంచి సేకరించిన చెత్త అంతా పంచాయతీ పారిశుద్ధ్య వాహనాల ద్వారా తీసుకువెళ్లి జలాశయం పరిసర ప్రాంతాల్లో వేస్తున్నారు. దీనికి తోడు చికెన్ షాపుల్లో ఉండే వ్యర్థాలైన కోళ్ల తలలు, కాళ్లు, ఎముకలు, పేగులు, కొవ్వు వంటి పదార్థాలు అక్కడే వేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా డంపింగ్ యార్డులా దర్శనమిస్తోంది. చిన్నపాటి వర్షం కురిసినా చెత్తంతా కుళ్లిపోయి దుర్వాస వెదజల్లుతోంది. జలాశయానికి వచ్చే పర్యాటకులు ముక్కు మూసుకుని పెద్దగెడ్డ అందాలను ఆస్వాదించే పరిస్థితి ఏర్పడుతోంది. ఇంత జరుగుతున్నా కనీసం పెద్దగెడ్డ అధికారులు పట్టించుకోకపోవడంతో, అధికారుల తీరుపై పర్యాటకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



ముళ్ల తుప్పల మధ్యలో శిలాఫలక స్థూపం

పర్యాటక అభివృద్ధి స్థలంలో వ్యర్థాలు

దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి, పెద్దగెడ్డ జలాశయాన్ని జాతికి అంకితం చేసే సమయంలో పెద్దగెడ్డను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో జలాశయం సమీపంలో మూడు ఎకరాల స్థలాన్ని కేటాయించారు. అయితే ఆ స్థలం పర్యాటక అభివృద్ధికి నోచుకోలేదు, ప్రస్తుతం ఆ స్థలం వ్యర్థాలతో నిండి డంపింగ్ యార్డులా దర్శనమిస్తోంది.



పెద్దగెడ్డ జలాశయం

ముళ్ల తుప్పల మధ్యలో శిలాఫలకం

జలాశయం జాతికి అంకితం చేసే సమయంలో వేసిన శిలాఫలక స్థూపం, ప్రస్తుతం ముళ్ల తుప్పల మధ్యలో ఉంది. అలాగే జనరేటర్ రూమ్ చుట్టూ కూడా ముళ్ల తుప్పలు, డొంకలు పేరుకుపోయాయి.

గుమ్ములు, గోతులతో పెద్దపెద్ద ప్రధాన గట్టు

జలాశయం ప్రధాన గట్టు, దారి పొడవునా పెద్ద పెద్ద గుమ్ములు గోతులతో దర్శనమిస్తోంది. అటుగా వెళ్లేందుకు పర్యాటకులు ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే ఇటీవల కురుస్తున్న వర్షాలకు కుడికాలువ సమీపంలో గట్టుపై కంకరమట్టి కోరుకుపోయి దిగువకు జారిపోతోంది. దీంతో గట్టు కొంతమేర కోతకు గురైంది. కనీసం దాన్ని పూడ్చేందుకు కూడా అధికారులు చొరవ చూపడం లేదు.



కోతకు గురవుతున్న ప్రధాన గట్టు

ముక్కు మూసుకుని వెళ్తున్నాం..

పెద్దగెడ్డ జలాశయం పక్క నుంచే మా గ్రామానికి వెళ్లాలి. చికెన్ షాపుల వ్యర్థాలు, చెత్త అంతా కూడా జలాశయం పరిసరాల్లోనే వేస్తున్నారు. దీంతో దుర్వాసన వస్తోంది. రోజూ అటుగా మా గ్రామం నుంచి, మండల కేంద్రానికి వచ్చినప్పుడు మళ్లీ మా గ్రామానికి వెళ్లేటప్పుడు ముక్కు మూసుకుని వెళ్తున్నాం. అధికారులు స్పందించి వేరేచోటకు వ్యర్థాలను తరలించే ప్రయత్నం చేయాలి.

– కునుకు సత్యనారాయణ, కొటికిపెంట గ్రామం